# లోకులు పలు కాకులు

రచన :
శ్రీ ఆర్. వామనమూర్తి

(గతసంచిక తరువాయి)

కుటుంబం ఏకాకి అయిపోయింది, యింగుపకట్టినగుడ్డలా సూర్యం మాష్టారు ఈలోకం విడిచిపోయినా ఆ కుటుంబానికి ఉడతాభక్తిగా ఎవరికి తోచినసాయాన్ని వాళ్లు చేస్తు అనుకుంటా వస్తూనే ఉన్నారు ఆ గ్రామస్తులు.

ఓరోజు అమాంతంగా కట్టు గుడ్డలతో వచ్చిన శారదను చూసి రామసుబ్బమ్మగారు కొయ్యబారి పోయారు.

ఓరోజున శారద అత్తగారు శారదకు వాతలు పెట్టేసిందట. ఇరవైనాలుగు గంటలు తాగి తందనాలాడుతూ ఆఫీసు మొహమే చూడ్డం మానేశాడట. చూసి చూసి ఇక లాభం లేదని ఉద్యోగం నుంచి సస్పెండు చేసేసేరట. ఒక్కొక్కమాట శారద చెపుతూఉంటే శ్యామల రామసుబ్బమ్మగారు బెల్లంకొట్టిన రాయిలా ఉన్నారేగాని మరేం చేయగలరు పాపం.

మొగుడు కొడితే భూమంతవాడు కొట్టేరన్నట్లు అయ్యింది ఆ ఇంట్లో శారద బతుకు ; ఆడబడుచులు కొట్టని రోజంటూలేదు. అత్తగారు ఓ రోజు కొట్టికొట్టి మావాడికి మళ్ళీ పెళ్ళి చేస్తాం. శనిలా మా ఇంట్లో అడుగు పెట్టాపు. పో అంటూ ఇంట్లోంచి గెంటించేసింది. శారద ఎంతచెప్పినా వినలేదు. మొగుడూ అలా చూస్తూ కొయ్య కొమ్మలా ఉన్నాడే కాని ఎందుకే అమ్మా దాన్ని అలా కొట్టి చంపేస్తావు అనైనా అన్నాడు కాదు. కొనకు నన్ను ఈ కట్టుకున్న చీరతో, ఈ చినిగిన జాకెట్టుతో రైలు ఎక్కించి మరీ ఎప్పుడూ నీ పాడుముఖం మాకు చూపించకు అంటూ బుగ్గమీద పొడిచి మరీ మా అత్తగారు వెళ్ళిపోయారు అంటూ శారద ముగించింది.

శారద మాటలతో అప్పటికే ఓ దెబ్బతిన్న రామసుబ్బమ్మగారు మరో దెబ్బ తిన్నారు. శారద యిక శాశ్వతంగా యిక యిక్కడే వుంటుందన్న మాట అనుకొన్నారు సుబ్బమ్మగారు.

రామసుబ్బమ్మగారు నలుగురైదుగురు తగు మనుషుల్ని పంపారు, ఆడపిల్లను యిచ్చుకొన్నందుకుగాను. వాళ్ళు కరెక్కలేదు సరికదా, ఉన్న ఆగంటల ఆ వాతావరణం అంతా చూసి పెద్ద మనుషులకు చిరాకెత్తింది.

కోర్టుకు ఎక్కించారు. కోర్టుకు ఎక్కినవారు, కాట్లోకి వెళ్ళినవారు ఒకటే అన్నట్లు ఎంతకాలానికి తెరిపికాలేదు. కానీ వచ్చేటట్లు లేదు. కుటుంబం నానాయాతనలు పడసాగింది. ఓ ప్రక్క కోర్టుకు పెట్టుబడి ?

అప్పటికే శారద షష్టిల్లు చేరి మూడు సంవత్సరాలు దాటింది. ఎన్నాళ్ళు దాగుతుంది శారదని మొగుడు వదిలేశాడన్నమాట అంతటా ప్రాకింది.

ఏ పేరంటానికి వెళ్ళినా ? ఏమే శారదా, నిన్ను మీ ఆయన వదిలేశాడటగా ? మీ అత్తగారు ఒట్టి కొయ్యముక్కలా మనిషట. మనం ఆడవాళ్ళం. 'ఓ ముక్క మొగుడు అనేవాడంటే పడాలిగాని యిలా కాళ్ళదన్నుకు వచ్చేస్తామా ?

మాకాలం మొగుడు చంపినా, అత్తగారు తిట్టినా అక్కడే పడి చావలసిందే కాని, యిలా పారిపోయి రావడం లేదమ్మా ? యివేం రోజులో అని శారదకు వినిపించేటట్టు, కొన్ని వినబడకుండా గుసగుసలు అనుకొనేవారు కొందరు.

ఎప్పుడైనా నీళ్ళకు వెళితే తనతోటివాళ్ళు శారదమ్మా, మాకంటే నువ్వే నయం. అత్తపోరు లేదు, ఆయన పోరు లేదు. మాకా దినదినం ఓ గండంలా వుందిలే తల్లీ అనేవారు.

గడ్డిపరక, తల్లిలేని పిల్ల చులకన అన్నట్లు, మగవాడి అండలేని ఆడది లోకం దృష్టిలో చులకనే. ఒకటి రెండు సార్లు శారద నీళ్ళకు వెడుతూవుంటే చూడరా ఎలా బలిసిపోతోందో, మొగుడా ? మద్దునా ? నావద్ద ఉంది కాదురా.... అన్న కుర్రాళ్ళమాటలు చెవిని పడ్డాయి.

తల్లితో యిరుగమ్మ, పొరుగమ్మవచ్చి ఏం అక్కయ్యగారు, పిల్ల కోర్టెంకిందటగా ? మనకు కోర్టెందుకమ్మా ? కొట్టినా, చంపినా వాడి వంచనే వుండాలి. కాస్త గంజి నీళ్లు పోస్తే త్రాగాలి, లేకపోతే పస్తుండాలి.

యిలా ఇంట్లో ఉంటే ఆడబుద్దో, అంతబుద్దో అన్నారు మనవాళ్ళు. ఏం చెప్పగలం. మన శారద మంచిదే అనుకోండి. అలా చేయదు. ఒకవేళ కర్మం కాలి

ఏ పాడుపనైనా చేసిందా? అది మన కెంత అప్రతిష్ట. ఎవరితోనైనా లేచిపోయింది అనుకుందాం? అప్పుడయినా మనం నలుగురిలో తలెత్తి తిరగగలమా అనే కబుర్లు పనికట్టుకువచ్చి చెపుతూండడం శారద చాలాసార్లు వింది.

మరి కొంతమంది పిన్నిగారు పళ్ళానికైనా గోడపట్టు ఉండాలి. మనబంగారం మంచిదే అని అనుకొంటే సరిపోతుందా, చెప్పండి. ఏమైనా ఈనాడు అండలేని బ్రతుకు ఏం బ్రతుకండి. నేను అలా అన్నానని ఏం బాధపడకు శారదమ్మ తల్లీ! వస్తాను పిన్నిగారు అంటూ కొందరు అలా అనేసి వెళ్ళిపోయేవారు.

యిలా రోజు రోజుకు అటువంటి మాటలు వింటున్న శారదకు పిచ్చి ఎక్కిపోతుందా అని అనిపించేది. కాని ఎలాగో నిగ్రహించుకొని మనసులోనే బాధపడేది. ఈ ప్రజలు కాకుల్లాంటివారు. ప్రతీది వారికే కావాలి? దాన్ని నానామాటలతో పొడిచేదాకా వారికి ఆనందం ఉండదు కాబోలు. ఈలోకంలో ఆడదై పుట్టేకంటే మ్రానై పుడితే మేలని అనిపించేది శారదకు.

రామసుబ్బమ్మగారికి ఈ ఆలోచనలతో ఒకోసారి రాత్రిళ్లు నిద్రకూడా రాదు. మతి పరిపరివిధాలుగా మనసు పోతుండేది.

ఓవేళ శారద తానే పాడు పనేదైనా చేస్తే? ఛా! శారద నా కూతురు. అలాటివాటికి ఆస్కారం లేదని తమాయించుకొనేది ఆవిడ.

పొద్దున్నే ఓరోజు శారద వాంతులు చేసుకోవడం, ఏరికోరి చింతకాయపంటి పులుపు తినడం రామసుబ్బమ్మ గారి దృష్టిలో పడింది.

లోకుల మాటల్లోని నిజానిజాలు అర్థమయిపోయాయి ఆవిడకు. శారద ఎక్కడో తప్పటడుగు వేసింది. నా పరువు గంగలో కలిసిపోయింది దేవుడా అంటూ బావురుమంది శారదవేపు చూస్తూ.

శారదకు అవేమీ అర్థం కాలేదు. ఏమిటమ్మా, ఏం జరిగింది.

ఏం జరగాలా, నంగనాచిలా అడుగుతున్నావు తెలియనట్లు. అంతా సీత, సావిత్రిలాంటి వాళ్ళే అనుకున్నాను గాని, ఇలా చేస్తావని అనుకోలేదు. రేపు నేను నలుగురిలో ఎలా తలెత్తుకు తిరగగలనే తల్లీ? నీకు సిగ్గు, లాగు లేదు. మరింతగా సాకాపానులు పెట్టసాగింది రామసుబ్బమ్మగారు.

ఏమిటమ్మా అసలు సంగతి అంది మళ్ళీ శారద. ఏమిటా అని అడుగుతున్నావు. చేసిన ఘనకార్యం చాలక నా? నీ వాంతులు, ఆ పులుపు తినడం అదీచూసి అప్పుడే అనుకొన్నాను అంటూ కోపాన్ని పట్టలేక శారద దవడ ఛెళ్లుమనిపించారు.

శారదకు అంతా అర్థమయింది. అమ్మా, నేను నీకూతుర్నమ్మా, నీవు పొరపడుతున్నావమ్మా, నేను ఎలాంటి నీచ పనికి పాల్పడలేదమ్మా అంది శారద.

ఒసేయ్ నేనూ అలాగే అనుకున్నానే! నిప్పుకు చెదలు పడతాయా అని. నాదగ్గర దాచకు అంది తల్లి.

'అమ్మా, అంటూ' ఓ ఉరుములా ఉరిమింది శారద. రంకు నేర్చినమ్మ బొంక నేర్చిందట. ఎన్నైనా చెపుతావు. ఎన్నాళ్లు దాచగలవే ఈరహస్యం అంది శారదవేపుచూస్తూ రామసుబ్బమ్మ.

పెదవి దాటితే పృథివి దాటుతుంది అన్నట్లు? ఎలాగో ఆమక్క ఊరంతా పాకిపోయింది. అంతా శారదను పురుగును చూచినట్లు చూడసాగారు. కనిపించినదగ్గరల్లా కాకుల్లా పొడవసాగారు. నిజానిజాలు ఈసమాజంలో ఎవరికి అక్కరలేదు. గోరంతలు కొండంతలుగా చేయడమే వీరికి బాగా తెలుసు.

కన్నతల్లే నిజంచెపితే నమ్మలేనపుడు లోకులు వింటారా? రోజు ఇంట్లో జరిగే రంపపుకోతకు కారణంగానే శారద ఈ అఘాయిత్యం చేయడం, ఆమె శవం నూతిలో తేలడం జరిగిపోయింది.

'ఈ వ్యవస్థ ఎప్పటికి మారుతుందో' శారద దస్తూరితో ఉన్న చీటీ నూతివగ్గర ఓ రాయిక్రింద గాలికి రెపరెపలాడుతోంది.

శవ పంచాయితీ జరిగి శవాన్ని పోస్టుమార్టానికి తీసుకు వెళ్ళిపోయారు. జబ్బు కాని గర్భిణీమాత్రం కాదని డాక్టరు రిపోర్టులో ఉండడంతో అందరూ అవాక్కయి పోయారు.

ఎప్పటికైనా యీవ్యవస్థ మారితే శారదలాంటివారి జీవితాలు హాయిగా ఉంటాయనుకుంటూ అక్కడనుంచి ఒక్కొక్కరే కదలి వెళ్ళిపోయారు. (సంపూర్ణం)